గడప గడపకూ సమస్యల పరిష్కారం

- సత్ఫలితాలిచ్చిన కార్యక్రమం
- మంత్రి రాజా చొరవతో పలు సమస్యలకు మోక్షం
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు

తుని రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం సత్ఫలితాలు ఇస్తోంది. ఈ కార్యక్రమంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, నియోజక వర్గ ఇన్‌చార్జిలు ఆయా నియోజకవర్గాల సచివాలయాల పరిధిలో పర్యటించి, ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. సచివాలయాలకు రూ.20 లక్షలు చొప్పున ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో అభివృద్ధి పనులు, సమస్యల పరిష్కారమవుతున్నాయి. దీంతో గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు, వీధిలైట్లు, కుళాయిలు, పింఛన్ల మంజూరు, రోడ్లు, కాలువలు వంటి సమస్యలు పరిష్కారమయ్యాయి. ఓటేసిన నాయకుడితో నేరుగా మాట్లాడి తమ సమస్యలు చెప్పుకునేందుకు అవకాశం ఏర్పడిందని పలువురు పేర్కొన్నారు.

ఎస్.అన్నవరంలో..

ఎస్.అన్నవరం సచివాలయం–2లో రోడ్లు భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా తొమ్మిది రోజులు గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమంలో పాల్గొని, 1,013 కుటుంబాలను కలుసుకున్నారు. ఆయనకు వివిధ సమస్యలపై 75 విన్నపాలు అందాయి. అందులో సిమెంట్ రోడ్లకు ఐదు, సీసీ కాలువలకు ఎనిమిది, తాగునీటి కుళాయిలకు 18, పైపులైన్లకు రెండు, ఇళ్లస్థలాలకు 22, గృహ రుణాలకు ఆరు, విద్యుత్ స్తంభాలకు పది, పింఛను, ఆధార్ నమోదు, సదరం సర్టిఫికెట్, వ్యక్తిగత మరుగుదొడ్డుకు ఒక్కొక్కటి చొప్పున అర్జీలు వచ్చాయి. ఈ సమస్యలను కొన్నింటిని ఒకరోజు, మరి కొన్నింటిని వారం రోజుల్లో పరిష్కరించారు. ఇంకొన్ని పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు.



పోస్టాఫీస్ వీధిలో వేసిన నాలుగు విద్యుత్ స్తంభాలు

రూ.20 లక్షల మంజూరు

ఎస్.అన్నవరం సచివాలయం–2లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం పూర్తవడంతో ప్రభుత్వం ప్రకటించిన రూ.20 లక్షల గ్రాంటు మంజూరైంది. ఆ నిధులతో కర్రి శివాజీ–నల్లల వెంకటేశ్వరరావు, కట్టా జగ్గారత్నం–ప్రగడ చిన్నబ్బాయి, నానబోలు ఆంజనేయులు–వంగలపూడి నాగేంద్ర, పోస్టాఫీస్–నల్లల నారాయణరావు ఇళ్ల మధ్య సిమెంట్ రోడ్లు నిర్మించారు. పంచాయతీ నిధులతో రెండు పబ్లిక్ కుళాయిలు వేశారు. 11 వ్యక్తిగత కుళాయిలు ఏర్పాటు చేయగా మరో ఐదు ఏర్పాటు చేసే ప్రక్రియ కొనసాగుతోంది. ట్రాన్స్‌కో అధికారులు విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేశారు. పింఛను, ఆధార్, సదరం సమస్యలు పరిష్కరించారు. ఇళ్ల స్థలాలు, గృహ రుణాలు, ఐఎస్ఎల్ రుణం మంజూరుకు చర్యలు చేపట్టారు.



మేగాదులవారి వీధిలో సచివాలయ గ్రాంటుతో నిర్మించిన సిమెంట్ రోడ్డు



తాకిసి అప్పారావు వీధిలో ఏర్పాటు చేసిన తాగునీటి కుళాయి

రక్షిత నీరు తాగుతున్నాం



ఇంట్లో వేసుకున్న బోరుబావి నీరు తాగేందుకు అనువుగా లేవు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో మా ఇంటికి వచ్చిన మంత్రి దాడిశెట్టి రాజాను కుళాయి వేయించాలని కోరాం. అడిగిన రెండు రోజులకే కుళాయి ఏర్పాటు చేసి రక్షిత నీరు సరఫరా చేస్తున్నారు. మాతోపాటు చుట్టుపక్కల వాళ్లు కుళాయి నీరు తాగుతున్నారు.

– వంగలపూడి చక్రమ్మ, ఎస్.అన్నవరం

వారం రోజుల్లో స్తంభం ఏర్పాటు



మా వీధిలో నాలుగు ఇనుప విద్యుత్ స్తంభాలు కూలిపోయే స్థితిలో ఉండేవి. మా ఇంటి పక్కనే ఉన్న స్తంభం ఎప్పుడు కూలిపోతుందోనని ఆందోళన చెందేవాళ్లం. మంత్రి దాడిశెట్టి రాజాకు ఈ విషయం తెలియజేయడంతో ట్రాన్స్‌కో అధికారులు వారం రోజుల్లో నాలుగు విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేశారు. ఇప్పుడు ప్రశాంతంగా ఉంది.

– కర్రి సూరిబాబు, ఎస్.అన్నవరం

వినతుల్లో 50 శాతం పూర్తి



ఎస్.అన్నవరం సచివాలయం–2లో మంత్రి దాడిశెట్టి రాజా పర్యటించినప్పుడు ప్రజలు నుంచి వివిధ సమస్యలపై విన్నపాలు అందాయి. మంత్రి రాజా ఆదేశాలతో వాటిలో 50 శాతం పరిష్కరించాం. ఇళ్లస్థలాలు, గృహ రుణాల మంజూరుకు ఆయా శాఖాధికారులు చర్యలు తీసుకున్నారు. శివారు ప్రాంతాల్లో కాలువలు, రోడ్ల నిర్మాణానికి ఏర్పాట్లు చేశాం.

– మధుశేఖర్, పంచాయతీ కార్యదర్శి, ఎస్.అన్నవరం

జగనన్న పాలవెల్లువతో ఆర్థిక భరోసా

కోటనందూరు: జగనన్న పాలవెల్లువతో పాడిరైతులకు ఆర్థిక భరోసా లభిస్తుందని పశువైద్యాధికారి రత్నతేజ అన్నారు. సోమవారం స్థానిక నూకాలమ్మ ఆలయ ప్రాంగణంలో ఏపీఎం సూర్యకుమారి అధ్యక్షతన చేయూత లబ్ధిదారులకు పాడిపశువుల పెంపకంపై అవగాహన సదస్సు జరిగింది. వెటర్నరీ డాక్టర్ రత్నతేజ మాట్లాడుతూ మెరుగైన పాడిపశువులను కొనుగోలు చేసి పెంచితే మంచి ఆదాయం వస్తుందన్నారు. పాడిరైతులకు మరింత ఆర్థిక చేయూతనిచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం అమూల్ సంస్థతో ఒప్పందం చేసుకుందన్నారు. అమూల్ ప్రతి మూడు నెలలకు ఒకసారి పాల ధరను పెంచుకుంటూ పోతుండడంతో మిగిలిన డెయిరీలు సైతం ధర పెంచక తప్పడం లేదన్నారు. ప్రణాళికాబద్ధంగా పశుపోషణ చేసుకుంటే ఆర్థిక స్వావలంబన సాధించొచ్చన్నారు. వైఎస్సార్ క్రాంతిపథం డీపీఎం రాయ్ మాట్లాడుతూ చేయూత లబ్ధిదారులు పాడిపశువులు కొనుగోలు చేసుకునేందుకు అంగీకారం తెలిపితే స్త్రీనిధి ద్వారా రూ.లక్ష వరకూ రుణం ఇస్తామన్నారు. గ్రామంలో ప్రాథమిక సర్వే నిర్వహించి లబ్ధిదారులకు గుర్తిస్తామన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు గర్సింగు దొరబాబు, కొరుప్రోలు కృష్ణ, దార్ల సూర్యచంద్ర తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పశువైద్యాధికారి రత్నతేజ

మిశ్రమ పంటలు సాగు చేద్దాం.. పుడమిని రక్షిద్దాం



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, నాయకులు, సచివాలయ సిబ్బంది

తుని రూరల్: మిశ్రమ పంటల సాగుతో పుడమితల్లిని రక్షిద్దామని, భూ సంరక్షణే ధ్యేయంగా రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటించాలని ప్రకృతి వ్యవసాయ విభాగం ప్రతినిధి రామకృష్ణ అన్నారు. సోమవారం కేఓ మల్లవరంలో నవధాన్యాల సాగు–నేలతల్లిబాగు, వేసవి పంటలతో భూ పోషకాలు వృద్ధి నినాదాలతో విద్యార్థులు, స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఖరీఫ్‌లో రైతులు 30 రకాల పంటలు సాగు చేయాలని, భూమిలో సూక్ష్మజీవులు అభివృద్ధికి బాటలు వేయాలన్నారు. భూసారం పెరిగితే పంటలకు కావలసిన పోషకాలు, ఇతరేతరాలు లభిస్తాయన్నారు. భూమి ఆరోగ్యంగా ఉంటే తెగుళ్ల అదుపులో ఉండి పంటలు పండుతాయన్నారు. ఆరోగ్యవంతమైన నేలలో తక్కువ పెట్టుబడితో నాణ్యత గల దిగుబడి సాధించవచ్చన్నారు. ఇందుకు నవధాన్యాల సాగు, సేంద్రియ విధానాలు ఉత్తమం అన్నారు. అవగాహన ర్యాలీని సర్పంచ్ దొంక సత్యవతి ప్రారంభించారు. మార్కెట్ కమిటీ డైరెక్టర్ అన్నంరెడ్డి వీర్రాఘవులు, వైఎస్సార్ సీపీ నాయకుడు దొంక వెంకట బెనర్జి, కార్యదర్శి పైల శివ, వీఏఏ భవానీ, ఎంసీఆర్‌పీలు ఎం.ఏసుబాబు, పి.శ్రీను, జి.దుర్గాప్రసాద్, రైతులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన ర్యాలీ

ఏలేశ్వరం: ప్రకృతి వ్యవసాయంపై తూర్పులక్ష్మీపురంలో సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో గ్రామంలో పలు వీధుల మీదుగా ర్యాలీ చేశారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎంపీటీసీ సభ్యుడు ఇజనగిరి ప్రసాద్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంతో తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం పొందవచ్చునన్నారు. ఆరోగ్యకరమైన పంటలను పండించేందుకు ప్రకృతి వ్యవసాయం దోహదపడుతుందన్నారు. వీహెచ్‌ఏ సువర్ణ, పడాల భాస్కరరావు, ముదర ఏసుబాబు, వెంకటలక్ష్మి, సత్యవేణి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

తాళ్లూరులో అన్నసమారాధన

గండేపల్లి: తాళ్లూరులోని బాలాత్రిపుర సుందరి సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో భారీ అన్నసమారాధన నిర్వహించారు. మహాశివరాత్రిని పురస్కరించుకొని సోమవారం జరిగిన అన్నదానంలో గ్రామస్తులు, భక్తులు, ప్రయాణికులు పాల్గొని స్వామి వారిని దర్శించి, అన్న ప్రసాదాలు స్వీకరించారు. దీంతో అక్కడ కోలాహల వాతావరణం నెలకొంది.

రక్తదానం



రౌతులపూడిలో రక్తదానం చేస్తున్న దాతలు

రౌతులపూడి: 'జై హింద్ హెల్పింగ్‌హ్యాండ్స్' స్వచ్ఛంద సంస్థ నాలుగో వార్షికోత్సవం సందర్భంగా మండల కేంద్రమైన రౌతులపూడిలో సోమవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. సంస్థ ఆధ్వర్యంలో స్థానిక శ్రీహర్ష పబ్లిక్ స్కూల్ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో 40 మందికి పైగా దాతలు రక్తదానం చేశారు. కాకినాడకు చెందిన అక్షయ బ్లడ్ బ్యాంకు పతినిధులు దాతలకు పరీక్షలు నిర్వహించి రక్తసేకరణ చేశారు. ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ రక్తదానం చేయాలని తద్వారా ఇంకొకరికి ప్రాణదాతలుగా నిలవాలని జై హింద్ హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ ప్రతినిధులు కోరారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

తుని: పురపాలక సంఘం కౌన్సిల్ సాధారణ సమావేశం చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి అధ్యక్షతన మంగళవారం ఉదయం 11 గంటలకు జరుగుతుందని కమిషనర్ ప్రసాదరాజు సోమవారం తెలిపారు. పట్టణాభివృద్ధికి సంబంధించిన పలు అంశాలను అజెండాలో పొందుపరిచామన్నారు. 30 వార్డులకు చెందిన కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు అన్ని శాఖలకు చెందిన అధికారులు హాజరు కావాలని ఆయన కోరారు.

ఈకేవైసీ నమోదుకు నేడే చివరి రోజు

గండేపల్లి: ఈకేవైసీ నమోదుకు మంగళవారంతో గడువు ముగియనున్నట్టు మండల వ్యవసాయాధికారి పి.సద్గురుమూర్తి సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2022–23 రబీ సీజన్‌లో 5824 ఎకరాలకు గాను 2455 మంది రైతులకు ఈ–క్రాప్ నమోదు ప్రక్రియ పూర్తి చేశామన్నారు. నమోదు చేసిన పంటలకు ప్రస్తుతం 5246 ఎకరాలకు గాను 2123 మంది రైతులు ఈకేవైసీ పూర్తి చేసినట్టు తెలిపారు. మండలంలో ఇప్పటి వరకు 91 శాతం ఈకేవైసీ నమోదు పూర్తయిందని జిల్లా వ్యవసాయాధికారి ఆదేశాల మేరకు నూరుశాతం నమోదు పూర్తి చేయించనున్నట్టు తెలిపారు. ఇంకా నమోదు చేయించుకోవాల్సిన రైతులు సమీప సచివాలయంలో రైతు భరోసా కేంద్రంలో నమోదు చేయించుకోవాలని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.


ఆక్రమణలు తొలగించాలంటూ వినతి



తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న రైతులు

ఏలేశ్వరం: వందలాది ఎకరాలకు సాగునీరందిస్తున్న తిమ్మరాజు చెరువు ప్రధాన కాలువపై ఆక్రమణలు తొలగించాలని రైతులు కోరారు. స్థానిక తహసీల్దార్ సూరపురాజుకు సోమవారం వినతి పత్రం అందజేశారు. రైతులు మాట్లాడుతూ పట్టణంలోని ప్రధాన పంటకాలువ ఆక్రమణలకు గురైందన్నారు. కాలువపై ఆక్రమణలు తొలగించి, పంట పొలాలకు సాగునీరు అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అలమండ పెదచలమయ్య, కోడం చిరంజీవిరావు, సామంతుల రామన్న, వింజరపు బ్రహ్మం, మత్స సత్యప్రసాద్, ఏడీవీ ప్రసాద్ పాల్గొన్నారు.

చంద్రశేఖర్ ఆజాద్‌కు నివాళి



ఏలేశ్వరంలో ఆజాద్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న విశ్వహిందూ పరిషత్ సభ్యులు

ఏలేశ్వరం: స్వాతంత్ర సమరయోధుడు చంద్రశేఖర్ ఆజాద్ 92వ వర్ధంతిని పట్టణంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో స్థానిక గ్రంథాలయంలో ఆజాద్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అధ్యక్ష కార్యదర్శులు ఏవీవీ ప్రసాద్, కటకం కిరీటి మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమంలో ఆజాద్ సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో లైబ్రేరియన్ కె.సత్యనారాయణ, వీహెచ్‌పీ సభ్యులు కందుల ప్రభాకరరావు, ఉడతల రమణరావు, బండుపల్లి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్య సాధనతో మంచి భవిష్యత్



ములగపూడిలో కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కల్పిస్తున్న కోటనందూరు ఎస్‌ఐ స్వామినాయుడు

కోటనందూరు: జీవితంలో లక్ష్యాలను ఏర్పాటు చేసుకొని వాటిని అధిగమించడం ద్వారా ఉత్తమ భవిష్యత్ సాధించవచ్చని ఎంపీడీఓ ఎస్.సుబ్రహ్మణ్యశర్మ అన్నారు. సోమవారం స్థానిక జెడ్పీ హైస్కూల్లో నిర్వహించిన కెరీర్ గైడెన్స్ డే కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థి దశలోనే క్రమశిక్షణతో, ప్రణాళిక బద్ధంగా చదువుకొని మంచి భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలన్నారు. మరో అతిథి కోటనందూరు ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజరు డి.కిరణ్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు మంచి విషయాలు వినడం, ఆచరించడం ఎంతో ముఖ్యమన్నారు. కెరీర్ నిర్మాణంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పీఎంసీ చైర్మన్ ఉల్లూరి శ్రీను, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వ్యక్తి వికాసంపై శిక్షణ తరగతులు

శంఖవరం: విద్యార్థులు చదువుతో పాటు వ్యక్తిత్వ వికాసం కోసం మంచి ప్రతిభ కనబరచాలని వాల్క్‌స్ కట్ ప్రైవేట్ లిమిటెడ్ రీజనల్ మేనేజర్ సురేఖ అన్నారు. కత్తిపూడి సీతారామా డిగ్రీ కళాశాల్లో మూడు రోజుల పాటు విద్యార్థులకు నైపుణ్యత,వ్యక్తిత్వ వికాశంపై శిక్షణ తరగతులు నిర్వహించనున్నారు.

మంచి ప్రవర్తన అలవర్చుకోవాలి

రౌతులపూడి: విద్యార్థులు మంచి నడవడిక, ప్రవర్తన అలవరుచుకోవాలని కోటనందూరు ఎస్‌ఐ స్వామినాయుడు అన్నారు. సోమవారం ములగపూడి జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల ఆవరణలో కెరీర్ గైడెన్స్‌పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చదువుతో పాటు జీవిత విలువలు, క్రమశిక్షణ, గురువులతో గౌరవంగా నడుచుకోవాలి. మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు సీహెచ్‌వీవీ సత్యనారాయణ, ప్రధానోపాధ్యాయురాలు చిట్టమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొమ్ము శనగ కోతకు సిద్ధం



టి.తిమ్మాపురంలో కొమ్ము శనగల పంట

తుని రూరల్: ఆరుతడిగా వేసిన కొమ్ము శనగ పంట పక్వానికి వచ్చి కోతకు సిద్ధంగా ఉంది. నీటి తడులు అవసరం లేకపోవడంతో మండలంలో టి.తిమ్మాపురం, ఎస్.అన్నవరం, దొండవాక పరిధిలో కొంత మంది రైతులు కొమ్ము శనగ పంట సాగు చేపట్టారు. పంట మార్పిడి, తక్కువ పెట్టుబడి, నీటి ఎద్దడి తట్టుకోవడంతో కొమ్ము శనగ వేసినట్టు రైతులు తెలిపారు. ఇతర అపరాల పంటలతో పోల్చితే దిగుబడి ఎక్కువగా ఉందని, స్థానిక మార్కెట్‌లో అమ్ముడవుతుందన్నారు. మార్చి మొదటి వారంలో కోత కోసి, ఎండిన తర్వాత నూర్పిడి చేస్తామని రైతులు తెలిపారు. ప్రకాశం వంటి జిల్లాలకే పరిమితమైన ఈ పంట మెట్ట భూముల్లో సాగుకు అనుకూలంగా ఉండడంతో క్రమంగా సాగు విస్తీర్ణం పెరుగుతుందని వ్యవసాయ అధికారి పి.జగ్గప్పారావు తెలిపారు.

మంచినీటి ట్యాంకు ఏర్పాటు చేయాలి

రౌతులపూడి: మండల కేంద్రమైన రౌతులపూడిలోని ఎస్సీపేటలో రక్షిత మంచినీటి ట్యాంకు నిర్మించాలంటూ జిల్లా మాలమహానాడు అధ్యక్షుడు చిట్టుమూరి గోవింద్ కోరారు. ఈ మేరకు పలువురు ఎస్సీపేటవాసులతో కలసి స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ ఎం.గోవింద్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. సురక్షిత మంచినీరు లేక ఎస్సీపేట వాసులు నానా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. దళిత బహుజన పార్టీ అధ్యక్షుడు నొక్కు రామకృష్ణ, ఎలుగొండి కృష్ణ,నర్సిపూడి నూకరాజు, ఎద్దు చిన్ని తదితరులు పాల్గొన్నారు.

మెకానికల్ విద్యార్థులకు వర్క్‌షాప్

గండేపల్లి: సూరంపాలెం ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలల మెకానికల్ విద్యార్థులకు పరిశ్రమ సంబంధిత సాధనాలు, ఎన్‌డీటీపై ఐదు రోజులపాటు వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్టు కళాశాలల ప్రిన్సిపాల్ ఆదిరెడ్డి రమేష్ తెలిపారు. జాతీయ స్థాయిలో ప్రారంభించిన ఈ కార్యక్రమానికి రిసోర్స్ పర్సన్, ట్రైనింగ్, ప్లేస్‌మెంట్ మేనేజర్లు సంధ్య వర్మ, డి.సతీష్ పాల్గొంటారన్నారు. ఫైనల్ ఇయర్ విద్యార్థులకు వర్క్‌షాప్‌తో పాటు శిక్షణ, అత్యాధునిక సాంకేతికతల గురించి వివరించనున్నట్టు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీన్ పుల్లెల ఎస్‌వీవీఎస్ఆర్ కుమార్, వైకేఎస్ సుబ్బారావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

నేడు మండల సమావేశం

గోకవరం: స్థానిక మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మంగళవారం నిర్వహించనున్నట్టు ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎస్ఎస్ దొర తెలిపారు. ఎంపీపీ సుంకర శ్రీవల్లి అధ్యక్షతన స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశం హాలులో ఉదయం 10.30 గంటలకు జరుగుతుందన్నారు. అన్ని శాఖల అధికారులు పూర్తి సమాచారంతో హాజరుకావాలన్నారు.

శ్మశాన స్థలం ఆక్రమణ

తొండంగి: ఎస్సీవర్గానికి చెందిన శ్మశాన స్థలం ఆక్రమణకు గురైందని సోమవారం తహసీల్దార్‌కు స్పందనలో గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. గ్రామానికి శివారులో సర్వే నంబర్ 515/1లో 2.25 ఎకరాలు దీర్ఘకాలం నుంచి ఎస్సీ సామాజిక వర్గానికి శ్మశాన వాటికగా వినియోగించుకుంటున్నారు. ఇటీవల ఈ స్థలం ఆక్రమణకు గురైందని సర్పంచ్ సోమాల ప్రసాద్, ఇతర ఎస్సీ సామాజిక వర్గ పెద్దలు కలిసి తహసీల్దార్ సుబ్రహ్మణ్యానికి ఫిర్యాదు చేశారు. దీనిపై తగిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హామీ ఇచ్చారు.

సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం

శంఖవరం: ఎమ్మెల్సీ అభ్యర్థిగా మాదిగ వర్గానికి చెందిన బొమ్ము ఇజ్రాయేలును ఎంపిక చేయడంపై ఏపీ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో కత్తిపూడి గ్రామానికి చెందిన నాయకులు, కార్యకర్తలు సోమవారం స్థానిక ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. తమ వర్గ నాయకుడికి ఎమ్మెల్సీ పదవి ఇవ్వడంపై హర్షం వ్యక్తం చేశారు.

ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు పలివెల సతీష్,బొడపాటి చంటి,జేమ్స్ విక్టర్,వైఎస్సార్‌సీపీ నాయకులు గాబు కృష్ణ,గౌతు నాగు,సర్పంచ్ కొల్లు సత్తిబాబు, ఎంపీటీసీలు చొప్పా రాంబాబు, చల్లా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే పర్వత, ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు

బ్లాక్ స్పాట్ ఏరియాల్లో స్టాపర్ బోర్డులు ఏర్పాటు

ప్రత్తిపాడు: స్థానిక పోలీస్ సర్కిల్ పరిధిలోని జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు స్టాపర్ బోర్డులు ఏర్పాటు చేస్తున్నట్టు స్థానిక సీఐ కె.కిషోర్‌బాబు తెలిపారు. పెద్దాపురం ఇన్‌చార్జి డీఎస్పీ ఎస్.మురళీమోహన్ సూచనల మేరకు ప్రత్తిపాడు పోలీస్ సర్కిల్ పరిధిలోని అన్నవరం, ప్రత్తిపాడు, ఏలేశ్వరం పోలీస్ స్టేషన్ల పరిధిలోని జాతీయ రహదారిపై ప్రమాదాలు జరిగే అవకాశాలున్న ప్రాంతాల(బ్లాక్ స్పాట్)ను గుర్తించి, ప్రమాదాల నివారణకు స్టాపర్ బోర్డులు ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. జాతీయ రహదారిపై చెందుర్తి వద్ద ఉన్న దొడ్ల డెయిరీ యాజమాన్యం ఈ స్టాపర్ల బోర్డులను సమకూర్చారు. వాటిని దొడ్ల డెయిరీ యజమాని ఎల్.సదాశివరావు, హెచ్ఆర్ మేనేజర్ ఎ.సుధాకర్ సోమవారం సీఐ కె.కిషోర్‌బాబుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రత్తిపాడు ఎస్సై ఎం.పవన్‌కుమార్, ఏఎస్సై కె.వెంకటేశ్వరావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

ప్రత్తిపాడు: వరంగల్ జీడబ్ల్యూఎంసీ ఇన్‌డోర్ స్టేడియంలో ఆదివారం నిర్వహించిన శ్రీమతి కేసరి చందర్ మెమోరియల్ 26వ జాతీయ ఆఫ్ లైన్, ఆన్‌లైన్ కరాటే చాంపియన్ షిప్ పోటీల్లో లంపకలోవ కరాటే స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. సుమన్ షోటోకన్ స్పోర్ట్స్ కరాటే–డో అకాడమీ నిర్వహించిన ఈ పోటీల్లో సింగల్ కాటాస్ విభాగంలో జరిగిన ఈ పోటీలో రాచపల్లి గ్రామానికి చెందిన ఇ.లారెన్స్ ప్రథమ స్థానంలో నిలిచాడని కరాటే మాస్టారు పి.బుజ్జి తెలిపారు. ఒమ్మంగి గ్రామానికి చెందిన సీహెచ్ కోదండరామ్ ద్వితీయ స్థానం, డీజై శ్రీఅరవింద్, జి.హర్షలకు తృతీయ స్థానం గెలుచుకున్నారని ఆయన తెలిపారు. విజేతలకు అకాడమీ చైర్మన్, సినీ నటుడు సుమన్ చేతుల మీదుగా మెడల్స్, ప్రశంసాపత్రాలను అందుకున్నారని ఆయన తెలిపారు. విజేతలను ఒమ్మంగి శ్రీభారతి విద్యానికేతన్ ఆవరణలో సోమ వారం సాయంత్రం కరస్పాండెంట్ సుంకర వీరబాబు, ఉపాధ్యాయులు, ఇతర సిబ్బంది సత్కరించారు.



విజేతలతో లంపకలోవ కరాటే స్కూల్ మాస్టార్ బుజ్జి

పన్నుల వసూళ్లపై దృష్టి సారించాలి

తుని: ఆర్థిక సంవత్సరం ముగుస్తున్నందున పురపాలక సంఘానికి చెల్లించాల్సిన ఆస్తి పన్ను సకాలంలో వసూలు చేసేందుకు సచివాలయ కార్యదర్శులు కృషి చేయాలని కమిషనర్ ప్రసాదరాజు కోరారు. సోమవారం సాయంత్రం మున్సిపల్ కార్యాలయంలో ప్రసాదరాజు అధ్యక్షతన రెవెన్యూ శాఖకు సంబంధించి సమీక్ష సమావేశం జరిగింది. పట్టణ పరిధిలో ఉన్న సచివాలయ రెవెన్యూ శాఖకు చెందిన కార్యదర్శులు పన్నుల వసూళ్లపై దృష్టి సారించాలన్నారు. వచ్చే నెల 30 లోగా 95 శాతం మేర లక్ష్యానికి చేరుకోవాలన్నారు. పన్నుల వసూళ్ల విషయంలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. వార్డు సచివాలయాల పరిధిలో నిర్ణయించిన మేరకు వసూళ్లు చేయాలని ఆదేశించారు. రెవెన్యూ అధికారులు శివాజీ, వల్లీ, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.



కార్యదర్శులతో సమీక్షిస్తున్న కమిషనర్ ప్రసాదరాజు

వైఎస్సార్ సీపీలో పలువురి చేరిక



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్

శంఖవరం: పెద్దిపాలెం గ్రామానికి చెందిన 50 కుటుంబీకులు సోమవారం టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలో చేరారు. పార్టీలో చేరిన పడాల సతీష్, నడిగట్ల నూకరాజు, నాగులాపల్లి సత్తిబాబు (పండు), కొంగు సురేష్, ప్రగడ చంటి, రీసు స్వామి, దేవర సత్తిబాబు, చెన్నంశెట్టి లోవరాజు తదితరులకు ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ కండువా వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీలో కష్టపడి పనిచేసిన వారికి సముచిత స్థానం ఉంటుందన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీనే విజయం సాధిస్తుందన్నారు. కార్యక్రమంలో అన్నవరం దేవస్థానం ట్రస్టు బోర్డు సభ్యుడు దో చిట్టిబాబు, ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్, నాయకులు దేవ లక్ష్మణ్, లొండ బాబు, ఏనుగు జాను, దేవర రమణ, గొల్లవిల్లి సుమన్ తదితరులు పాల్గొన్నారు.

పేకాడుతున్న ఏడుగురి అరెస్టు

గండేపల్లి: పేకాట ఆడుతున్న ఏడుగురిని అరెస్టు చేసి, రూ.1.40 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నట్లు గండేపల్లి ఎస్సై వై.గణేష్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. నీలాద్రిరావుపేట శివారులో రహదారిని ఆనుకొని ఉన్న ఒక డాబాలో పేకాడుతున్నట్టు సమాచారం అందడంతో దాడి చేసి ఏడుగురు వ్యక్తులను అరెస్టు చేశారు. 52 పేక ముక్కలు, రూ.1.40 లక్షల నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి, వారిని కోర్టులో హాజరుపర్చినట్టు ఎస్సై తెలిపారు. సింగరంపాలెం శివారులో సారా తయారు చేస్తున్న వారిపై దాడి చేసి, 5 లీటర్ల సారా స్వాధీనం చేసుకొని సారా తయారీకి ఉపయోగించే 200 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్టు ఎస్సై తెలిపారు. వీరిని పెద్దాపురం కోర్టుకు తరలించినట్టు చెప్పారు.

కల్యాణ మండపం అభివృద్ధికి చర్యలు

కిర్లంపూడి: సత్యదేవా కల్యాణ మండపం అభివృద్ధికి చర్యలు చేపడతామని దేవదాయ శాఖ డిప్యూటీ ఇంజినీర్ ఎస్.ఉదయ్‌కుమార్ అన్నారు. స్థానిక సత్యదేవా కల్యాణ మండపాన్ని సోమవారం ఆయన పరిశీలించి, మండపం కొలతలు సేకరించారు. ఈ సందర్భంగా ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ దేవస్థానాలను అన్ని విధాల అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. దానిలో భాగంగా సత్యదేవా కల్యాణ మండపం ఆవరణలో నూతన మినీ మండపాన్ని నిర్మించేందుకు అన్నవరం దేవస్థానం ఆధ్వర్యంలో ప్రతిపాదనలు సిద్ధమయ్యాయన్నారు. ఈ కార్యక్రమంలో మండల సచివాలయ కన్వీనర్ పెనగంటి రాజేష్, అడారి గంగబాబు, పలువురు సిబ్బంది ఉన్నారు.

మొక్కజొన్న పంట పరిశీలన

గోకవరం: ఇటికాయలపల్లి గ్రామంలో దెబ్బతిన్న మొక్కజొన్న పంటను వ్యవసాయ శాఖ అధికారులు సోమవారం పరిశీలించారు. గ్రామానికి చెందిన రైతు యర్రంశెట్టి శివబాబు మూడెకరాల్లో మొక్కజొన్న సాగు చేపట్టాడు. ఇటీవల పంటకు మందు పిచికారీ చేయగా రెండెకరాల పంట ఎండిపోయింది. దీనిపై రైతు వ్యవసాయశాఖ అధికారులకు ఫిర్యాదు చేయగా ఏఓ పి.రాజేశ్వరి తదితరులు పంటను పరిశీలించారు. సుమారు రూ.లక్ష నష్టం వాటిల్లిందని, తనను ఆదుకోవాలని రైతు అధికారులకు విజ్ఞప్తి చేశాడు.



పంటను పరిశీలిస్తున్న ఏఓ రాజేశ్వరి, ఇతర సిబ్బంది

ఇన్‌స్పైర్ అవార్డులకు ఐదుగురి ఎంపిక

తొండంగి: విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీసేందుకు ప్రభుత్వం నిర్వహించిన సైన్స్ ప్రాజెక్టులకు సంబంధించి ఇన్‌స్పైర్ అవార్డులకు మండలం నుంచి ఐదుగురు విద్యార్థులు ఎంపికైనట్టు మండల విద్యాశాఖ అధికారి ఎస్‌కే బాబ్జి సోమవారం తెలిపారు. ఆరు నుంచి తొమ్మిదో తరగతులకు చెందిన పలు ప్రాజెక్టులు తయారు చేయగా వాటిని ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేశారు. ఎ.కొత్తపల్లి జెడ్పీ హైస్కూలు నుంచి కె.వి.కామేశ్వరీ, కొమ్మనాపల్లి జెడ్పీ హైస్కూలు నుంచి జి.జోగికిషోర్, అద్దరిపేట నుంచి బి.భవాని, బెండపూడి నుంచి సీహెచ్ తేజస్విని, కొత్తపెరుమాళ్లపురం నుంచి వై.ప్రసాద్ ఎంపికయ్యారన్నారు.